పుత్రోత్సాహం

మీరు నా అభిప్రాయంతో ఏకీభవించపోతే అది మీ దురదృష్టం. నా ఉద్దేశమేమిటంటే ఈ అచ్చు యంత్రమనేది రావడముంది చూచారా యిది దేశానికి పెద్ద బెడదై పోయింది.

వంటచెయ్యడం ఎలా? అందుకొక పుస్తకం. పెరట్లో కూరగాయలు పండించడం ఎలా? అందుకొక పుస్తకం. ఆఖరుకు మీ బిడ్డల్ని మీరు పెంచడమెలా? ఇందుకున్నూ ఒక పుస్తకమే! ఏమండీ, నాకు తెలియక అడుగుతాను. మన స్వంత బిడ్డల్ని మనం పెంచుకోవడానికి కూడా మనకింకొకడి బోడి సలహాలు కావలసివచ్చాయా?

ఆ పప్పులు మాదగ్గరుడకవు. మా వూళ్ళో మేము బిడ్డల్ని పెంచే పద్ధతే వేరు. ఇది మిగిలిన లోకులకంతా ఆదర్శప్రాయమని నా గట్టి నమ్మకం. కానీ దీన్ని గురించి లోకానికి తెలియవద్దా? తప్పకుండా తెలిసి తీరాలి. అందువల్ల లోక కల్యాణం నిమిత్తం ఈ పనికి పూనుకోవడమైంది.

ఒకనాటి ఉదయం మావూరి బడిగంట మ్రోగింది. టంగుటంగున మ్రోగింది - అని నేను చెప్పలేదు. ఇందులోని ఆంతర్యాన్ని మీరు శ్రద్ధగా గమనించాలి. కొండవూట నీళ్లు త్రాగడం వల్ల రాచిపోయిన గొంతుకలా బడిగంట తుస్సు తుస్సున మ్రోగింది. అందుకు కారణం 'బెల్‌సుత్తి' మాయం కావడం! ఉదయం తొమ్మిది గంటలకు ప్రారంబమయ్యే బడికి చాలామంది పిల్లలు ఏడింటికల్లా వచ్చేస్తారు. వచ్చింది మొదలు ఏ మాత్రం ఆలస్యం చెయ్యకుండా ప్రహరీ గోడలపైన, చెట్ల కొమ్మలపైన, పూరింటి దూలాలపైన చక్కగా సర్కస్ ఫీట్లు అభ్యాసం చేస్తారు. గంట తొమ్మిది కావచ్చేటప్పటికి బెల్ కొట్టే మహదవకాశాన్ని చేజిక్కించుకోడం కోసం మా పిల్లలు చేసే వ్యక్తిగత ప్రయత్నాలవల్ల 'బెల్ సుత్తి' మాయమైపోతుంది. ఎవడి దగ్గరుంటుందో అంతుపట్టదు. బడిలో నేను హెడ్మాష్టర్ని గదండీ! (బడి బయట నాకు చాలా హోదాలున్నాయిలెండి). 'రేయ్, గంట కొట్టండ్రా, అని నేనరుస్తాను. అప్పుడు బెల్‌కు చేరువగా వున్న కుర్రాడు చేతికి దొరికిన కంకర రాయితో దాన్ని వాయించేస్తాడు. పాపం, గంట టంగుటంగున మ్రోగమంటే ఎలా మ్రోగుతుంది? అదండీ విషయం!

గంట మ్రోగిన తర్వాత ఆనాటి ఉదయం మా బడిలో ప్రార్థన అనే తతంగం కూడా జరిగింది. ప్రత్యేకత ఏమీ లేదు. అన్ని రోజులూ ఎలా జరుగుతుందో ఆ రోజున్నూ అలాగే జరిగింది. గంట కొట్టడానికి, ప్రార్థన చేయడానికి అట్టే తేడా వుండవలసిన అవసరం లేదని మా పిల్లల నిశ్చితాభిప్రాయం. భక్తినీ, సంగీతాన్నీ మైనస్ చేసి ప్రార్థనా గీతాన్ని ఒక సామూహిక ఘోషగా వినిపించడం చిరకాల సాధనల వల్ల వాళ్లకలవడిన కూసువిద్య.

ప్రార్థనానంతరం హాజరు పట్టీ చేత బట్టుకుని నేను క్లాసు రూంలోకి జొరబడ్డాను. జొరబడ్డానికదేమైనా అహవరంగమా అని మీరనుకోవచ్చు. ఇంచుమించుగా అంతేనండీ! జనాభా

పెరగడం వల్ల ధరలు పెరగడం వల్ల నిరుద్యోగులు పెరగడం వల్ల దరిద్రం పెరగడం వల్ల మానవ జీవితం పరిసరాలతోనూ, పరిస్థితులతోనూ ఒక అనివార్యమైన పోరాటంగా పరిణమించింది గదా! మా పిల్లలు పెరిగి పెద్దవాళ్ళయ్యేటప్పటికి పరిస్థితులు మరింతగా విషమించవచ్చు. అందువల్ల దూరదృష్టితో భావి జీవితానికి అవసరమైన తరిఫీదునంతా మేము కుటుంబ స్థాయినుంచీ, పాఠశాల స్థాయి నుంచీ వాళ్ళ కందిస్తున్నాము. అసలింత వరకు 'క్లాస్ రూం' అన్నాను కదండీ! అది వట్టి అర్థం లేని మాట! క్లాసు కొక్క రూమయితే అది క్లాసురూము. అన్ని క్లాసులూ ఒక రూములోనే ఉంటే దాన్ని క్లాసు రూం అనడం ఎలా పొసుగుతుంది? మధ్య గోడలేని అయిదంకణాల పూరిండ్లు రెండింటిని కలిపి దానికి మేము 'ప్రాథమిక పాఠశాల' అని బోర్డు తగిలించాము. నేమ్ బోర్డు వ్రేలాడుతూ వుంటుంది కనుక అది పాఠశాల కాదని నిరూపించడం మీ తరం కాదు. మేకల మందను దడిలోనికి తోలినట్లుగా రెండువందల యాభై మంది పిల్లల్ని అందులోకి తోలేస్తాము. క్లాసుకు క్లాసుకు మధ్య హద్దులేవీ కనపించకపోతే, అది వర్గరహిత సమాజానికి మేము వేస్తున్న పునాది అని మీరనుకోవాలి. అయితే మా కొండ గుర్తులేవో మాకున్నాయనుకోండి! ఆగ్నేయ మూలలలో ఒకటోక్లాసు. నైరుతి మూలగా నాలుగోక్లాసు. వాయవ్యంలో అయిదు ఈశాన్యంలో రెండు..... అబ్బ, ఎంత తొందరండీ మీకు! మూడో తరగతి కూడా వుందిలెండి! అయితే అది నాలుగ్గోడల మధ్య వుండదు. టీచరు లేకపోవడం మూలాని అది స్వేచ్ఛావాయువులు పీల్చుకుంటూ హాయిగా బడి వెనుక చెట్లక్రింద వుంటుంది. విధిగా అక్షరం ముక్కలు నేర్చుకు తీరాలన్న పట్టింపు మా పిల్లలకు గానీ, ఎట్లాగైనా వాళ్ళకు చదువు వచ్చేటట్లు చూడాలన్న కక్కుర్తి మా ఉపాధ్యాయులకు గానీ లేదని హెడ్మాస్టర్నిగా నేను సాధికారంగా చెప్పగలను. పరీక్షలనే వాటికి పూచిక పుల్లంత విలువైనా లేదనీ ప్రతీరోజూ బడిని పావనం చేస్తూ వుంటే పై తరగతికి వెళ్లడం ఖాయమనీ గ్రహించలేని అజ్ఞానులేం కాదు మా కుర్రవాళ్ళు. ఒకవేళ ఏదైనా గ్రహపాటు వల్ల ఒకరో అరో అక్షరం వచ్చినప్పటికీ ఆ చదువును పూర్తిగా విస్మరించడానికి వీలుగా పై తరగతులకు వెళ్ళినప్పుడు చదువులు మకిలి సోకి మనసులు మలినం కావడానికి వీల్లేకుండా మూడో తరగతి పిల్లలకీ విధంగా మేము ఆరుబయలు చెరసాల ఏర్పాటు చేశాము.

తొడతొక్కిడిగా వున్న పిల్లల్లో నుంచి దారి చేసుకుంటూ వెళ్ళి నేను అయిదో తరగతి కుర్చీలో కూచున్నాను. హాజరు వేయడం కోసం రిజిష్టరును తొడపైన పెట్టుకున్నాను. టేబిలు సంగతి అడక్కండి! టేబిలును గురించి మా స్కూలు ఉపాధ్యాయులకు తెలిసిందల్లా దాని స్పెల్లింగు మాత్రమే. వరుసగా పేర్లు పిలుస్తున్నాను. పదకొండో పేరు దగ్గర కలం ఆగిపోయింది.

"రాంబాబు లేడుసార్! రాలేదు సార్!" అంటూ పదిపన్నెండు కంఠాలు ఒక్కుమ్మడిగా ఉద్ఘోషించాయి.

రాంబాబు స్కూలుకు రాకపోవడం విడ్డూరమే! బడికి రెగ్యులర్‌గా వచ్చే అబ్బాయి రాంబాబు. విద్యను కోరివచ్చే వాడు కాదు గనుక 'విద్యార్థి' అని పేర్కొనడం బాగుండదు. 'క్రీడార్థి' అంటే ఆ మాట సత్య సమ్మతంగా వుంటుంది. ఉదయం ఏడు నుంచి తొమ్మిది దాకా, మధ్యాహ్నం పన్నెండున్నర నుంచి ఒకటిన్నర దాకా, సాయంకాలం నాలుగు నుంచి బాగా చీకటి పడేదాకా ప్రతి రోజూ మూడంచెల్లో జరిగే కబాడీ ఆటలో ఒక జట్టుకు తిరుగులేని నాయకుడు రాంబాబు. పప్పులేని పెళ్లిలా, రాంబాబ లేని స్కూలేమిటి?

హాజరు గుర్తించడంతోనే, నేను సాధారణంగా ఒక అత్యవసర కార్యక్రమంలో పాల్గొనవలసి వుంటుంది. పాఠాలు చెప్పడం కాదు. నేరాలు విచారించడం. సుబ్బారాయుడిగారబ్బాయి మేదర

గంగన్న కొడుకును మురికినీటి గుంటలో పడద్రోసి వుంటాడు. మునసబుగారి మనుమడు మునగచెట్టు వీరయ్య కొడుకును వెదురు బెత్తంతో బాది వుంటాడు. సర్పంచి గారి సుపుత్రుడు నత్తికిష్టిగాణ్ణి నెత్తురొచ్చేటట్లుగా కొరికేసి వుంటాడు. ఇలాంటి క్రిమినల్ కేసులే గాక పుస్తకాలు కనిపించక పోవడం, కలాలు గల్లంతు కావడం తావులు దురాక్రమణ చెయ్యడం మొదలైన సివిల్ కేసులు మరెన్నో! కోర్టు వ్యవహారాలంటే ఏమిటో తెలియని దురవస్థ ఏర్పడకుండా భావిపౌరులకీ శిక్షణ బాగా ఉపకరిస్తుందని మా విశ్వాసం. పైగా న్యాయమనేది అందరికీ ఒకేవిధంగా గాక, ఆస్తి, అంతస్తు పలుకుబడి మొదలైన వాటిని బట్టి విభేదిస్తూ వుంటుందన్న వాస్తవిక పరిజ్ఞానం పిల్లల్లో నెలనాటుకునేటట్లుగా తీర్పులివ్వడంలో కూడా మేము జాగరూకత వహిస్తాము. ఈ జరూరు విషయాల అలజడిలో పడిపోయి రాంబాబు గైర్‌హాజర్ కావడం గురించి నేను తాత్కాలికంగా విస్మరించాను.

ఇంటర్వెల్లో నేను వీధికొసన వున్న పోస్టాఫీసుకు వెళ్ళి వచ్చేటపపటికి పాఠశాల వాలకం హాలాహలం ఉద్భవించినప్పటి క్షీరసాగరాన్ని తలపిస్తూ వుంది. పులిదిండి సుబ్బరాజు భార్య కనకమ్మ ఎత్తయిన బండపైన నిల్చుని, అధికార పక్షాన్ని దుయ్యబట్టే ప్రతిపక్ష సభ్యురాలిలా తల త్రిప్పుతూ, చేతులూపుతూ మాట్లాడేస్తోంది. చుట్టూ మూగి బడిపిల్లలు ఎంతో బుద్ధిగా ఆసక్తిగా ఆమె ప్రసంగాన్ని వింటున్నారు. గ్రామ ప్రజలు కొందరు ప్రత్యేకాహ్వానితుల హోదాలో విచ్చేసి సభను జయప్రదం కావిస్తున్నారు.

"ఏమయ్యా నేనొక మాటడగతా! ఓ కుర్రాడు బడికి రాకపోతే ఎందుకు రాలేదని అయ్యవారు తెలుసుకోవద్దా? ఇంట్లో వుండి రాలేదా? ఇంట్లో లేక రాలేదా? ఒంట్లో బాగుండకరాలేదా? ఒంట్లో బాగుండికూడా రాలేదా? రాకపోతే ఏమయ్యాడు పోనీ అదంతా తెలుసుకునే ఓపిక లేకపోయిందేననుకో! ఇంటికైనా చెప్పి పంపొద్దా. ఇప్పుడు నేనున్నాను. రాంబాబు తల్లిని. బిడ్డ ఇంట్లోనూ లేక బడిలోనూ లేకపోతే నేనేమనుకోవాల? ఏ గంగలో దూకాల? ఇంతకూ ఈ స్కూల్లో అయ్యవార్లు మేలుకున్నట్టా? నిద్రపోతున్నట్టా? వచ్చిన గొడ్డును కట్టెయ్యాలిగానీ, రానిగొడ్డును వెదుక్కోవాలని గానీ, తెలియకపోయాక యింక వీళ్ళకు గవుర్మెంటు జీతాలిచ్చే దెందుకంట?"

పిల్లలకు చదువు చెప్పడం కోసం గవర్మెంటు మాకు జీతాలిస్తోందని నేను కనకమ్మకు బదులు చెప్పి వుండొచ్చు. కానీ అలా చెపన్పడంలో పొంచివున్న ప్రమాదమేమిటో నాకు తెలుసు. ఏదీ మా అబ్బాయి కొక అక్షరం ముక్కయినా రాలేదేమని నిలదీసి అడిగితే అప్పుడిక ఆమెకు జవాబు చెప్పడం కష్టం. అందుకని నేనామెతో యుద్ధానికి దిగదలచలేదు. సంధికే పూనుకున్నాను.

"అమ్మా, కనకమ్మా! నీకు కోపం రావడము సబబే! ఒప్పుకుంటున్నాను గదా! నాది పొరబాటై పోయింది. రాంబాబు స్కూల్లో లేకపోవడం వల్ల ఇంట్లో వుండి వుండొచ్చు ననుకున్నాను. నవ్వు వాడినెక్కడికైనా పంపించి వుంటావనుకున్నాను. లేకుంటే వాళ్ల నాన్న వాడికేదైనా పని పురమాయిచేడేమోననుకున్నాను. రాంబాబును గురించి ఆచూకీ తీయకపోవడానికి యింతకుమించిన దురుద్దేశమేదీ లేదు. అయినా యిప్పుడు మించిపోయిందేముంది? నా దగ్గర మెరికల్లాంటి కుర్రాళ్లున్నారు వాళ్ల తోపులూ, దొరువులూ, వాగులూ, వంకలూ అన్నీ గాలించి రాంబాబు ఎక్కడున్నా పట్టుకొస్తారు. నీ కొడుకును నీకు పువ్వుల్లో పెట్టి అప్పగించే పూచీ నాది! కానీ ఆ పనికి పూనుకోడానికి ముందు, రాంబాబు తల్లివిగా నువ్వు నీ సహకారం కొంత మాకందివ్వాలి" అన్నాను.

నా చాణక్యనీతి ఎదుట కనకమ్మ చిత్తు చిత్తయిపోయింది. గాలితో పోట్లాటకు తలపడిన మల్లయుద్ధ వీరుడిలా బిక్కచూపులు చూడసాగింది.

ఆ సందర్భాన్ని మెలకువగాఉపయోగించుకుంటూ నేను అసలు సిసలైన పత్తేదారీ సరిళిలోకి దిగేశాను. "ఏమమ్మా కనకమ్మా! నువ్వు కడపటిసారిగా రాంబాబును చూచిందెప్పుడు! అప్పుడు వాడేం చేస్తున్నాడు?"

గుప్పిట్లో చిక్కిన మిడతలా గుడ్లు మిటకరించింది. "నేనా! రాంబాబునా? నిన్న మధ్యాహ్నం భోజనానికి వచ్చాడు గదా! అదేనయ్యా నేను వాణ్ని చూడ్డం!

"మరైతే నిన్న రాత్రికూడా వాడింటికి రాలేదన్నమాట! ఎక్కడ భోంచేశాడో?"

"అబ్బే వచ్చి వుంటాడు. నేనింట్లో లేనే! మా మేనత్త కూతుర్ని యింటికి పిల్చుకునే శాస్త్రమైతే దానికి నేను, మా ఎదురింటి మంగమ్మ పిన్ని మిద్దింటి కామాక్షమ్మ యింకా అయిదారు మందిమి కలిసి తిప్పరాజుపేట కెళ్లిపోయాము. తిరిగొస్తూ రుద్రవరంలో రెండో ఆట సినిమా చూచుకుని మూడు గంటల బండి మన స్టేషనులోకి వచ్చేటప్పటికి యిల్లు జేరుకున్నాము...?"

పోనీ అప్పుడైనా నువ్వు రాంబాబు యింట్లో వున్నదీ, లేనిదీ గమనించి వుండొచ్చు గదా?'

"అయ్యో. యింటి దగ్గర పడుకునే అలవాటు వాడికెక్కడిదండి అయ్యగారూ! నడివీధిలో మా ఆడపడుచు నిచ్చాంగదా! గ్రామచావడి దగ్గర మా చిన్నత్తావాళ్లున్నారు గదా! ఇంకా వూరంతా బంధువులా మరేమన్నానా? కుర్రాడు తన సావాసకాపులతో కలిసి ఎక్కడ పడుకుంటాడో ఏమో! కుర్రాడెక్కడ పడుకుంటే నేమిలే అని మేమూ పట్టించుకోము. ఎక్కడ పడుకున్నా వాడు తెల్లవారాక చద్దన్నం కోసం యింటికొచ్చేస్తాడు...."

"మంచిదేనమ్మా! ఊళ్ళో యిళ్లన్నీ మనవేననుకోడం, ఎక్కడ నిద్రొస్తే అక్కడ పడుకుని నిద్రపోవడం, ఎంత బంధువులైనా దూరి తినడం బాగుండదు గనుక భోజనానికి మాత్రం యింటికే రావడం యిదంతా చాలా బాగుంది. అయితే, ఈ రోజుదయం చద్దన్నంకోసం యింటికొచ్చినప్పుడైనా వాడు నీకు కనిపించి వుండాలి గదా!"

"సరేసరి! ఇంట్లో కూచుంటే నాకెట్లా జరుగుతుందండీ అయ్యగారూ! జెర్సీ ఆవుకు గడ్డి తేవాలిగదా! ఆవేళప్పుడు నేనింట్లో వుండనే!"

"అవునమ్మా! నువ్వింట్లో లేకపోతే వాడికి చద్దన్నం పెట్టేదెవరు?"

"ఒకరు పెట్టాల్సిన పనేముంది! చక్కా వస్తాడు. ఇంటి చూరులో మాకు తాళం చెవిని దాచిపెట్టే చోటొకటి వుందిలెండి! దాంతో తాళం తీసి వాడిపాటుకు వాడు కంచం పెట్టుకుని అన్నం తింటాడు. మళ్ళీ తాళంవేసి, చెవిని చూరులోనే పెట్టి బడికొచ్చేస్తాడు."

ఇంకేమని అడగాలో తోచన నేను కొద్ది క్షణాలు మౌనంగా వుండిపోయాను. చింతపల్లిలో సరిగంధం వాళ్లింటి ఆడపడుచు కనకమ్మ. మా వూళ్ళో పులిదిండి వాళ్ళింటి కోడలుగా వచ్చింది. అటూ యిటూ గూడా బంధువుల బలగం హెచ్చు. ఒక వూళ్ళో అమ్మాయిని యింటికి పిలుచుకునే శాస్త్రం. ఇంకొక ఊళ్ళో ఉగాది సాంగ్యం. ఒకచోట పురుడు ఇంకొకచోట పుట్టు వెంట్రుకలు తీయడం. చాలని దానికి పెండ్లిండ్లు. ఈ బంధు కార్యాలన్నింటికి వెళ్లవలసి వుండడం వల్ల కనకమ్మ వరసగా నాలుగు రోజులు యింట్లో వుండడం కుదరదు. ఇంట్లో వున్న రోజుల్లో తెల్లవారగానే ఆమె గడ్డికోసం వెళ్లడం తప్పనిసరి. అమ్మలక్కలతో పిచ్చాపాటి కింక మిగిలినవి మధ్యాహ్నం వేళలే! పదేళ్ల కొడుకు రాంబాబూ రాత్రుల్లో యింటి దగ్గర పడుకోడు. ఉదయం వాడు వచ్చేసరికి కనకమ్మ యింట్లో వుండదు. ఈలెక్కన తల్లిని కొడుకు, కొడుకును తల్లీ చూడకుండా రోజులకు రోజులే గడిపెయ్యవచ్చునని

నాకప్పుడు బోధపడింది. కానీ కొంచెం పునరాలోచన చేసి చూచుకున్నాక కనకమ్మ కథనంలో ఎక్కడో ఒక లింకు సరిగ్గా అతకడం లేదని నేను గ్రహించాను. చటుక్కున అదిగూడా స్ఫురించింది. అన్నట్టూ యింట్లో వున్నది తల్లీ కొడుకులిద్దరే కాదు కదా! ఆ మూడోవ్యక్తి ముఖ్యమైన వ్యక్తి కూడా! అతడి మాటేమిటి?

"చూడమ్మా, కనకమ్మా మీ ఇంటాయన అయినా రాంబాబుని చూచి వుండొచ్చు గదా! ఆయన్నొకమాట అడగలేక పోయావా?" అన్నాను.

"అయ్యో, రాత! అంతమంచి ముఖానికి అర్ధసేరు పసుపు కూడానా! ఆయన యింటిపట్టున వుండేవాడైతే నాకేం తక్కువ! అంతా నేనడిగొచ్చిన వరంలెండియ్యగారూ!" విసవిసా వీధిలోకి వెళ్లిపోయింది కనకమ్మ.

తానడిగిన వరంలో భర్తకు సంబంధించిన అంశంలో మాత్రం పెద్ద లొసుగేదో వుందని కనకమ్మ అభిప్రాయం. అతడయినా దుర్మార్గుడేమీ కాదు. నాలుగెకరాల మాగాణి, అయిదెకరాల మెట్ట, సాలీనా అయిదారు వేలదాకా ఆదాయం వచ్చే మామిడితోటా ఈపాటి వెసులుబాట్లతో అతడు తలుచుకుని వుంటే సంసారం పూలతెప్పను కాలప్రవాహం పైన సాఫీగా, సరదాగా నడిపివుండొచ్చు. కానీ ఏ పూర్వజన్మ పుణ్య పరిపాకం వల్లనో అతడి పాలిటికి సంసార సుఖాలన్నీ చాలా నిస్సారమైనవిగా కనిపిస్తాయి. ఎవరెవరికి ఎక్కడెక్కడ ఆత్మానందం లభిస్తుందో ఎవరు చెప్పగలరు? అర్థాంగి సాన్నిధ్యంలో అనుభవానికి రాని జీవన మాధుర్యం అతడికి చతుర్ముఖ పారాయణంలో లభ్యమవుతుంది. పుత్రగాత్ర పరిష్వంగంలో అనుభూతికి రాని మహదానందం పేకముక్కల స్పర్శలో లభిస్తుంది. ఎక్కడ ఫలానా సోపు వుండునో అక్కడ ఆరోగ్యముండును అని గదా ప్రకటన! 'ఎక్కడ పేకముక్కలు, డబ్బులు చేతులు మారుచుండునో అక్కడ సుబ్బరాజుండును" అని వివరణ.

రెండు మూడు రోజులు అహోరాత్రులూ 'ఆట'లో పాల్గొన్న తర్వాత చుట్టపుచూపుగా ఒకసారి యింటికి వచ్చి వెళ్ళడం సుబ్బరాజు రివాజు. స్నానం చేసి దుస్తులు మార్చుకోడానికన్నది బాహ్య కారణం. పైకం సర్దుకోడానికన్నది ఆంతరంగిక కారణం. బహుశా అలాంటి ట్రిప్పుపైనే ఊరిముఖం చూచినట్టున్న సుబ్బరాజు రాంబాబు కనిపించకుండా పోయిన నాటి సాయంకాలం భజనగుడి సందులో నాకెదరయ్యాడు.

"నమస్కారం సార్! ప్రొద్దున్నే మా ఆవిడ స్కూలు దగ్గరకొచ్చి పెద్దగా కారుబారు చేసిందంటగదూ? ఆ మనిషంతేలెండి! మీరు మరేమీ అనుకోవద్దు. దేవళ్ల చెరువులో కామమ్మ తిరణాల జరుగుతూ వుంది గదా! మావాడక్కడికే వెళ్లుంటాడు. ఆ వూళ్లో మాకు దగ్గర బంధువులు గూడా వున్నారులెండి! వస్తాడు లెండి సార్! రాకెక్కడికిపోతాడు?"

అప్పటికి అజాపజా లేకుండా మాయమైన కుర్రాడు స్వయానా నా బిడ్డ అయినట్టు, దిగులు పడకుండా ఉండడం కోసం ఎవరో ఒక పరాయి పెద్దమనిషి ఒకతను నాకు ధైర్య వచనాలు చెబుతున్నట్టు సుబ్బరాజు మాటల్లో ధ్వనించడం వల్ల నా గుండె కాస్తా తేలికపడింది.

రెండు రోజులు గడిచిపోయాయి. దేవళ్ల చెరువులో తిరణాల కూడా ఆపాటికి ముగిసి వుంటుంది. మధ్యమధ్యలో నేను రాంబాబును గురించి వాకబు చేస్తూనే వున్నాను. ఎప్పుడడిగినా 'లేదు, తెలియదు' లాంటి సమాధానాలే వినిపిస్తూ వచ్చాయి.

మా వూళ్ళో మేము సాయంకాలపు షికార్లు వెళ్ళడానికి అనువైన చోటు స్టేషన్ ప్లాట్‌ఫారమే! దక్షిణాది నుంచి వచ్చే ఆరుగంటల బండి స్టేషనులో ఆగి తిరుపతి వైపు సాగిపోయింది. రైలు వచ్చి వెళ్లిపోయిన అయిదు నిముషాల కల్లా మావూరి స్టేషన్ నిర్మానుష్యమై పోతుంది. అప్పుడు మసక

చీకటిలో నేను ఫ్లాట్‌ఫారంపైన నడిచి వస్తూండగా సీమబాగి చెట్టు బోదె చుట్టూ నల్లటి ఆకారమేదో తారట్లాడుతున్నట్టు తోచింది. నాదృక్పథం నుంచీ మరుగైపోవడం కోసం అది బోదె చాటుకు జారుకుంటున్నట్టు తోచడంతో అనుమానం అతిశయించి "ఎవరక్కడ? రేయ్ ఎవడ్రా నువ్వు? ఇవతలికి రారా" అని గద్దించాను.

"నేన్సార్, రాంబాబుని" అని, అంతటితో ఊరుకోక 'ఇహిహీ' అని వాడు పళ్ళు కూడా యికిలించాడు.

"నువ్వట్రా అడ్డగాడిదా! ఓరి నీయిల్లు బంగారం గానూ, ఎంత పని చేశావురా? ఎక్కడికెళ్ళావురా? మూడురోజులుగా ఎక్కడున్నావురా? మాటమాత్రమైనా చెప్పకుండా నీ ఇష్టమొచ్చినట్లు వెళ్ళిపోతావా? ఉండు నీ పని చెబుతాను. అయినా యిప్పుడెక్కడి నుండి ఊడిపడ్డావురా నువ్వు" అంటూ కొంచెం ఫీంకారం సలిపి చూచాను.

"ఇందాకట్నే బండి దిగాన్సార్! మీరు నన్ను చూళ్ళేదులే! నేన్మాత్రం మీరక్కడుండడం చూశా!"

"ఘనకార్యం చేశావులేరా బడుద్దాయి వెధవా? ఇటువైపెవరున్నార్రా నీకు? ఎక్కడికెళ్ళొస్తున్నావు?"

రాంబాబు మాటల్ని యధాతథంగా ఉదహరించాలంటే తెలుగులో 'షార్ట్‌హేండ్' అయినా వచ్చి వుండాలి. లేకుంటే టేప్ రికార్డరయినా అందుబాటులో వుండాలి. ఆ సదుపాయాలు రెండూ నాకు లేకపోవడం వల్ల వాడి యాత్రా వృత్తాంతాన్ని నా మాటల్లోనే చెప్పేస్తున్నాను. రాంబాబు పెద్దతల్లి కొడుకొకడు 'ఇంటరు'లో చేరి కొత్తగా తిరుపతిలో మకాం పెట్టాడు. రాత్రి ఎనిమిది గంటల బండికి వచ్చి తనను కలుసుకోవలసిందిగా వాడు పంపిన ఆహ్వానాన్ని పురస్కరించుకుని వీడు వెళ్ళి స్టేషనులో దిగాడు. దొంగబండి ఎక్కడం, పురవీధుల్లో బలాదూర్లు తిరగడం, సినిమాలు చూడడం యిదంతా రాంబాబుకు కొట్టిన పిండే! కానీ ఈసారి వీడు వెళ్ళేసరికి రమ్మన్నవాడు స్టేషనులో లేడు.

వాడి గదెక్కడో వీడికి తెలియదు. పోనీలెమ్మని వీడు స్టేషనుకు దగ్గరగా వున్న థియేటరుకు వెళ్ళి నయనానందకరమైన ఓ హిందీ స్టంటు సినిమా చూశాడు. ఆట వదిలిపెట్టాక మళ్ళీ స్టేషన్లోకే వచ్చేశాడు. రెండుగంటల బండి బయల్దేరడానికి సిద్ధంగా వుంది. అరగంట సేపట్లో ఊళ్ళో వాలొచ్చుగదా అని పెట్టెలోకెక్కి బెంచీపైన కూర్చున్నాడు. అంతవరకూ వాడిది సదుద్దేశమే! ఎటొచ్చీ వాడుకూర్చున్న బెంచీ ఖాళీగా వుండడమే ప్రమాదమై పోయింది. బద్దకంతో మేను వాల్చడమే వాడి పొరబాటు. ఒళ్ళు తెలియకుండా నిద్రపట్టింది. లేచి చూసేటప్పటికి భళ్ళున తెల్లవారిపోయింది. అదే స్టేషనో ఏమిటో తెలిసిన ముఖం ఒక్కటీ కనిపించడం లేదు. అంతా కొత్తగా వుంది. బోర్డులో తనకు చిరపరిచితాలైన తెలుగక్షరాలకు బదులుగా మరేదో వంకర టింకర గీతలు కానవస్తున్నాయి. కొందరిని పలకరించడానికి ప్రయత్నిస్తే 'పోడా'పో అని విసుక్కున్నారు. బ్రిడ్జి ఎక్కి దిగి కాలుగాలిన పిల్లిలా ఊరంతా చెడ తిరిగాడు. ఆ వూరిపేరు 'కాట్పాడి' అని తెలుసుకునేసరికి వాడి తల ప్రాణం తోకకొచ్చింది. ఆకలికి తట్టుకోలేక ఒక నాస్టా కొట్టులో నాలుగిడ్లీలు మాత్రం తిని, బస్‌స్టాండ్ సెంటర్లో తిరుగుతుండగా వీడొక పోలీసు కంట్లో పడ్డాడు. 'ఆంధ్రా' నుంచి దిగిన తాజా పిక్‌పాకెట్టై వుంటాడని భావించి ఆ పోలీసాయన వీణ్ణి స్టేషనుకు లాక్కెళ్ళాడు. ఆ పగలూ రాత్రీ గూడా వీడు పోలీస్ స్టేషన్‌లోనే 'రెస్ట్' తీసుకున్నాడు. వదిలిపెడితే తిరిగి చూడకుండా స్వంత ఊరు చేరుకుంటానని వాగ్దానం చేసిన మీదట అరవ పోలీసులు కరుణించి వీణ్ణి వదిలేశారు. నాణెం పైకి ఎగరవేస్తే బొమ్మే పడి తీరాలన్న నియమమేమీ లేదు.

బోరుసు కూడా పడొచ్చు. రాంబాబు సురక్షితంగా స్వగ్రామానికే తిరిగి వచ్చేశాడంటే అది కేవలం యాదృచ్ఛికం. ఇంకొక ప్లాట్‌ఫారంలో గనుక రైలెక్కి వుంటే వాడు తిరువణ్ణామలై యో, విళ్ళుప్పురమో వెళ్లి మరింత లోకజ్ఞానం సముపార్జించుకోగలిగి వుండేవాడు!

"బండి దిగిన వాడివి ఇంటికి వెళ్ళక! యిక్కడెందుకుతచ్చాడుతున్నావురా?" అని గదమాయించాను.

"మరి... మరేమో సార్.. మా అమ్మా, నాన్నా కొడతారేమోనని.."

నాకు పొట్టచెక్కలయ్యేటట్టుగా నవ్వాలనిపించింది. "ఓరి పిచ్చి కుంకా! ఆ సందేహమెందుకొచ్చింది నీకు? భయమేమీ వద్దు. నేరుగా యింటికి వెళ్ళు. నూటికి తొంభై పాళ్ళు మీ అమ్మ యింట్లో వుండదు. ఇక మీ నాన్న సంగతి నీకు తెలియందేముంది. తాళం చెవి చూరులో వుంటుంది. తలుపు తీసి శుభ్రంగా భోంచెయ్యి. నీకెట్లాగూ యింట్లో పడక పొందదు గదా! వెళ్ళి ఎవరింట్లోనైనా పడుకో. బాబ్బాబూ! నీకు పుణ్యముంటుంది. రేపుదయాన్నే తప్పకుండా బడికొచ్చేయ్. నువ్వు కనిపించకపోవడం వల్ల నీతోడి కబాడీ ఆటగాళ్ళు దిగులు పడిపోతున్నారు" అన్నాను.

* * *

"బిడ్డ ఎంతదూరం వెళ్ళి తిరిగొచ్చేశాడో తెలుసా! ఆ వూరుండడం మన యిస్టేట్‌లో కూడా కాదటమ్మా! అక్కడందరూ అరవమే మాట్లాడతారట! తీసుకెళ్ళిన డబ్బు కూడా అంతంత మాత్రమే! అయినా ఎట్టాగో చలాయించుకొచ్చేశాడే! అష్ట తెలువులమ్మా వాడికి" అని కనకమ్మా,

"మావాడేం సామాన్యుడా! ఉక్కు పిండం కదటయ్యా! నువ్వు బుట్టలో పెట్టి బావిలోకి దిగవిడువు. వాడు చేంతాడు పట్టుకుని చక్కా పైకెక్కి రాకపోతే నన్నడుగు" అని సుబ్బరాజూ.

పదిమందితోనూ చెప్పుకోడం విని 'ఆహా! పుత్రోత్సాహమంటే యిదే కాబోలునని నేను ఆనందంతో పులకించిపోయాను.

(చదువు కథలు - 1994)